ఇనుప స్తంభం తొలగింపు

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఆవరణలో ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని అధికారులు తొలగించారు. ఈ నెల 1న 'షాక్ కొడుతున్నా పట్టించుకోరా' అనే కథనం సాక్షి పత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులు ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ లైన్‌కు కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానిక ప్రజలు 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

వేములపల్లి(మాడుగులపల్లి) : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్లాడారు. సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను శాఖల వారీగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని దరఖాస్తులను మాత్రమే జిల్లా అధికారులకు పంపించాలన్నారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న ధరణి, భూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వీధిలైట్లను ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంగీత, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ శివరాంకుమార్, కార్యదర్శులు, పాల్గొన్నారు.


వేములపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

సమర్థవంతంగా నిర్వహించాలి

వేములపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శారదాదేవి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, డీటీ కోటేశ్వరి పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ : కలెక్టర్ ఆదేశానుసారం ఈనెల 15 నుంచి ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. సోమవారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని అవంతీపురంలో రెండు, తుంగపాడు, తడకమళ్ల, రాయినిపాలెం, కాల్వపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఓ సైదానాయక్, షఫీ, రమేష్, బిందు, గోపి, అఫ్రిన్ పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ : గ్రామపంచాయతీలో పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరుతూ మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు సోమవారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్‌లుగా తమ పదవీకాలం పూర్తయినా ఇప్పటివరకు తమకు రావాల్సిన నిధులు రాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల పదవీకాలంలో తాము గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశామని, పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు, మొక్కలం పెంపకం వంటి అనేక పనులు చేపట్టినట్లు తెలిపారు. 9నెలల నుంచి తమకు పెండింగ్‌లో ఉన్న నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ధనావత్ ప్రకాశ్‌నాయక్, సచిన్, రాంసింగ్, పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సంద్ర నాగరాజు, ఎమ్మెస్పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు అన్నారు. సోమవారం మిర్యాలగూడలోని సంఘం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు మధు, ఎంఎస్‌పీ నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, సుధాకర్, నాగరాజు, చైతన్య రెడ్డి, దైద సురేష్, చైతన్య, శ్రీను, సూరన్న, మహంకాళి సురేశ్ ఉన్నారు.

మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

దేవరకొండ : మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జమియత్ ఉలేమా ఏ హింద్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఆరాధించే మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూపీకి చెందిన నర్సింగ్ ఆనంద్ సరస్వతిని కఠినంగా శిక్షించాలని కోరారు. ముఫ్తీ జావీద్ హుస్సేన్ ఖాస్మీ, సయ్యద్ అజీమొద్దీన్ మాట్లాడారు. అంతకు ముందు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి దేవరకొండ సీఐ నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఫ్తీ రిజ్వాన్, ఇలియాస్ పటేల్, పారూఖ్ మౌలానా, నజీర్ మౌలానా, ఖాజా మొహినొద్దీన్, అన్సారీకలీం, ఖదీర్, సలీం, ఫయాజ్, అఫ్రోజ్, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీలకు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : అవంతిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మార్కెట్ కమిటీని బీసీలకు కేటాయించలేదని, బీసీలు 55శాతానికి పైగా ఉన్నప్పటికీ బీసీలకు అవకాశం కల్పించలేదన్నారు.

బస్తీదవాఖాన ప్రారంభించాలి

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలో పైలాన్‌కాలనీలో రూ.14లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించిన బస్తీదవాఖాన పూర్తయ్యి సంవత్సరం గడిచినా నేటికి ప్రారంభించలేదని స్థానిక కౌన్సిలర్ రమేశ్‌జీ సోమవారం గ్రీవెన్స్‌లో నల్లగొండ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత శాసన సభ ఎలక్షన్‌కంటే ముందే మరమ్మతులు పూర్తి చేశారని ఎలక్షన్ కోడ్ రావడంతో ప్రారంభించలేదని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యి 11నెలలు గడస్తున్నా నేటికీ ప్రారంభించలేదని కలెక్టర్‌కు విన్నవించారు. పేద ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్తీ దావఖానను ప్రారంభించాలని కోరారు. దీనిపై స్థానిక సంస్థల కలెక్టర్ పరిపూర్ణ స్పందించి అక్కడే ఉన్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌ను పిలిచి వెంటనే బస్తీదావఖానను ప్రారంభించాలని ఆదేశాలిచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలో ఆస్పత్రి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

అడవిదేవులపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీతండాలో జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీతండాకు చెందిన రమావత్ వాలి(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. తన కోసం కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తీవ్ర మనోవేదనకు గురైన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి వాలిని కిందకు దించగా అప్పటికే ఆమె మృతిచెందింది. వాలికి ఇద్దరు కుమారులున్నారు. వాలి భర్త రమావత్ తులసీరాం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి వస్రాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : బీఎల్‌ఆర్

మిర్యాలగూడ : నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్యాలయం గ్రామాల్లో దేవాలయం లాంటిదని, గ్రామ ప్రజలు ఎటువంటి సమస్యలు వచ్చిన మొదట సంప్రదించేది గ్రామ పంచాయతీ కార్యాలయాన్నేనన్నారు. నాయకులు, అధికారులు ఎల్ల ప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు శ్రీదివ్యకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. అదేవిధంగా దామరచర్ల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పిల్లవాగు బంగారు మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణ భూమి పూజలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌లు పాల్గొని పూజలు చేశారు.


లక్ష్మీపురం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సెరికల్చర్‌తో రైతులకు అధిక లాభాలు

కొండమల్లేపల్లి : సెరికల్చర్‌తో రైతులకు అధికలాభాలను పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లికి చెందిన డాక్టర్ సబ్జెక్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ టి.మాధురి అన్నారు. మండలంలోని చింతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని దేశముకోనికుంటలో చేపూరి ప్రమోద్ గౌతమ్ సాగు చేస్తున్న మల్బరీ తోటను సోమవారం ఆమె పరిశీలించారు. చిన్న, సన్నకారు రైతులకు మల్బరీ తోట సాగు, పట్టు పురుగుల పెంపకం ద్వారా రైతులు నెలనెల ఎకరానికి రూ.50వేల నుంచి రూ.60వేల సంపాదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ గీతం, భువనేశ్వరి, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

నాగార్జునసాగర్ : తాత్కాలిక ఇంటిని నిర్మాణం చేసుకుంటుండగా ఎలాంటి నోటీసులు, సమచారం ఇవ్వకుండా తన సిబ్బందితో వచ్చి కూల్చివేసిన నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మూడావత్ లక్షణ్‌నాయక్ సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 60ఏళ్ల నుంచి ఆ స్థలంలోనే తమకుటుంబం నివాసముంటుందని రాళ్లరప్పలమధ్య ఉండటం వల్ల ప్రాణాంతకమైన కీటకాలు తేళ్లు, పాములు వస్తుండటంతో రాతిగోడను తొలగించి సిమెంటు ఇటుకలతో రేకులు వేసుకునేందుకు గోడలు నిర్మాణం చేస్తుండగా కూల్చివేశారని పేర్కొన్నారు. వెంటనే కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణిలో సమస్యల పరిష్కారం

మిర్యాలగూడ : ప్రజావాణిలో ప్రజలు అందించే దరఖాస్తులను పరిశీలించి సత్వరమనే సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఉంటారని, అర్హులైన ప్రజలకు సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేస్తారన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్









జనహృదయనేతకు
జన్మదిన శుభాకాంక్షలు
నిరాడంబరులు, స్నేహశీలి, అనునిత్యం
ప్రజలతో మమేకమయ్యే
నాయకులు, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే
శ్రీ కుందూరు జయవీర్‌రెడ్డి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు
మీరు మరెన్నో జరుపుకోవాలని
మనసారా కోరుకుంటూ..
Happy
Birthday
ANNA
మీ...
మిట్టపల్లి వెంకటేష్